నేడు ఖనిలో కాకా జయంతి

కోల్‌సిటీటౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర కార్మికశాఖ మాజీమంత్రి, మాజీఎంపీ దివంగత జి.వెంకటస్వామి 96వ జయంతి ఆదివారం గోదావరిఖనిలో నిర్వహిస్తున్నట్టు ఆలిండియాఅంబేద్కర్ యువజనసంఘం, తెలంగాణ అంబేద్కర్ భవన నిర్మాణకమిటీ చారిటబుల్ ట్రస్ట్ కమిటీ ఒకప్రకటనలో తెలిపింది. ఆర్‌జీ-1 జీఎం కార్యాలయం సమీపంలోని వెంకటస్వామి విగ్రహం వద్ద కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పేర్కొంది. కాగాఆలిండియా అంబేద్కర్ యువజనసంఘం నాయకులు, ఇతర దళితసంఘాల నాయకులు హాజరైనివాళులు అర్పించాలని నాయకులు మధు, కొంకటి లక్ష్మణ్, కాంపెల్లి సతీష్,బూడిద మహేందర్ కోరారు.

డీజీపీని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే



రాష్ట్ర డీజీపీకి బొకే అందిస్తున్న ఎమ్మెల్యే విజయ రమణారావు

పెద్దపల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నూతనంగా రాష్ట్ర డీజీపీగా నియమితులైన శివధర్ రెడ్డిని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు శనివారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు ఎమ్మెల్యే పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు.

'అలయ్ బలయ్'ని విజయవంతం చేయండి

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నిదర్శనమైన అలయ్ బలయ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సామాజిక ఐక్యవేదిక కన్వీనర్ క్యాతం వెంకటరమణ పిలుపునిచ్చారు. ఆదివారం అడ్డగుంటపల్లిలోని సిరిఫంక్షన్ హాల్‌లో 50కులసంఘాల ప్రతినిధులతో ఈకార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు, ఇందులో తెలంగాణ వంటకాలు, రుచులను అందిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, పోలీస్‌హౌసింగ్ కార్పొరేషన్ మాజీచైర్మన్ కోలేటి దామోదర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్ర సంజీవరెడ్డి హాజరవుతారని, కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

రామగుండాన్ని విద్యాహబ్‌గా మారుస్తా

● రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

కోల్‌సిటీటౌన్, అక్టోబర్ 4 (ఆంధ్రజ్యోతి): రామగుండాన్ని విద్యాపరంగా అత్యాధునిక సదుపాయాలతో విద్యాహబ్‌గా మార్చేందుకు కృషిచేస్తానని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. శనివారం గోదావరిఖనిలో నిర్మించనున్న ప్రభుత్వ జూనియర్‌కళాశాల నిర్మాణానికి అనుకూలమైన స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతంలోని విద్యార్థులకు నాణ్యమైనవిద్యను అందించే కేంద్రంగా మార్చనున్నామన్నారు. విద్య ప్రతిఇంటికి అందాలని, పట్టణం, పరిసర గ్రామాల్లో విద్యార్థులు ప్రైవేట్‌కళాశాలల్లో అధికఖర్చులతో చదువుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని వారిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ కళాశాలల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. కళాశాల నిర్మాణానికి సంబంధించి త్వరితగతిన పరిపూర్ణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణను విజయవంతం చేయండి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నిర్వాహకులు

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): నస్పూర్‌లోని గోదావరి ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం జరిగే అమృతమంజరి భాగం-2 ప్రేమగల చేతుల నైపుణ్యం అనే ఆధ్యాత్మికపుస్తక విడుదల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శ్రీలహరికృష్ణ స్తుతి ధ్యానకేంద్రం నిర్వాహకులు రవికుమార్ కోరారు. శనివారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఈ పుస్తకావిష్కరణకు పెద్దఎత్తున భక్తులు తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సమ్మయ్య, శ్రీనివాస్, శ్రీరాములు, కొమురయ్య పాల్గొన్నారు.

కాపులపల్లిలో ఈకేవైసీ నమోదు

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాపులపల్లి గ్రామంలో శనివారం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో జాబ్ కార్డు ఉన్నవారికి ఈ కేవైసీ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈకేవైసీ చేసుకోకుంటే పనికి వచ్చినప్పుడు కూలీడబ్బులు చెల్లింపులు జరగవని లబ్ధిదారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

పల్లెల్లో ఎన్నికల సందడి

● ఎక్కడ చూసినా స్థానిక ఎన్నికల గురించే చర్చ
● టిక్కెట్ల కోసం పార్టీ నేతల చుట్టూ ప్రదక్షిణలు
● మొదలైన కండువాల మార్పిడి
● గెలిచే సత్తా ఉన్న వారికే టిక్కెట్లు ఇవ్వాలని పార్టీల నిర్ణయం



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పల్లెల్లో రాజకీయ సందడి మొదలయ్యింది. ఎక్కడ నలుగురు గుమిగూడినా కూడా స్థానిక సంస్థల ఎన్నికల గురించే చర్చ జరుగుతున్నది. జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు స్థానాలకు రిజర్వేషన్లు ప్రకటించడంతో పోటీ చేసేందుకు అవకాశం ఉన్న నాయకులు టిక్కెట్ల కోసం, మద్దతు కోసం నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. రిజర్వేషన్లను సెప్టెంబర్ 25వ తేదీన ప్రకటించగా, ఆ తర్వాత 26వ తేదీన మండల, జిల్లా పరిషత్, గ్రామ పంచాయతీ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఒకేసారి ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. ఈ ఎన్నికల షెడ్యూల్ గందరగోళంగా ఉండడంతో రెండు ఎన్నికల్లో పోటీచేసేందుకు అనుకూలంగా లేకపోవడంతో ఆశావహులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు.. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జారీచేసిన జీవో9ని సవాల్ చేస్తూ రెడ్డిజాగృతి సంఘం నాయకుడు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఈనెల8వ తేదీన కోర్టు పూర్తిస్థాయిలో విచారించనున్నది. తాజాగా అదే నాయకుడు సుప్రీం కోర్టులోనూ పిటిషన్ వేశారు. దీనిపై కోర్టులు ఏ విధంగా స్పందిస్తాయోననే ఆసక్తి ఏర్పడింది. అసలు స్థానిక సంస్థల ఎన్నికలు ఇప్పట్లో జరుగుతాయా, లేదా అనే చర్చ జరుగుతున్నది. తెలంగాణ ప్రాంత ప్రజలు అత్యంత వైభవంగా జరుపుకునే సద్దుల బతుకమ్మ, దసరా పండుగలు ముగియడంతో శనివారం నుంచి రాజకీయ సందడి

(మిగతా 8వ పేజీలో)

● జిల్లాలో రెండు విడతల్లో ఎన్నికలు..

జిల్లాలో 13జడ్పీటీసీ స్థానాలతో పాటు 137ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. 263 గ్రామ పంచాయతీలు, 2432వార్డు స్థానాలు ఉన్నాయి. రాష్ట్రంలో మండల, జిల్లా పరిషత్ ఎన్నికలను రెండు విడతల్లో నిర్వహిస్తుండగా, పంచాయతీ ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించేందుకు షెడ్యూల్ జారీ అయ్యింది. జిల్లాలో రెండు ఎన్నికలను రెండు విడతల్లోనే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ నిర్ణయించారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను మొదటివిడతలో మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్, పాలకుర్తి, అంతర్గాం, ధర్మారం మండలాల్లో, రెండవ విడతలో పెద్దపల్లి, కాల్వశ్రీరాంపూర్, ఓదెల, సుల్తానాబాద్, ఎలిగేడు, జూలపల్లి మండలాల్లో నిర్వహించనున్నారు. ఇదేవిధంగా పంచాయతీ ఎన్నికలను రెండవ, మూడవ విడతలో నిర్వహించనున్నారు.

పార్టీ గెలుపే కార్యకర్తల గెలుపుగా పనిచేయాలి

● మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

ధర్మారం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్లు ఎవరికి వచ్చినా పార్టీ గెలవడమే అనివార్యమని, పార్టీ గెలుపే కార్యకర్తల గెలుపుగా పనిచేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, గిరిజనశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కోర్టు తీర్పు ఎలా ఉన్నా కార్యకర్తలంతా ఎన్నికలకు సన్నద్ధం కావాలని సూచించారు. మండలంలోని 15ఎంపీటీసీ స్థానాలకు పోటీచేసే ఆశావాహులు పార్టీఅధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతి రెడ్డిని కలిసి తమ వినతిపత్రాలు అందజేయాలని తెలిపారు. అదేవిధంగా ఒక్కస్థానం నుంచి ఎంతమంది పోటీలో ఉన్నా అభ్యర్థనలు స్వీకరించాలని పార్టీ అధ్యక్షుడికి సూచించారు. ప్రత్యర్థి పార్టీ నుంచి పోటీచేసే అభ్యర్థుల బలాబలాలను చూసుకొని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. టికెట్ ఎవరికి వచ్చినా కార్యకర్తలంతా సమన్వయంతో పనిచేయాలని, టికెట్ రాని వారికి భవిష్యత్తులో నామినేటెడ్ పోస్టులతో సంతృప్తి పరిచే బాధ్యత నాదని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ పచ్చని చెట్టు లాంటిదని పార్టీలో వర్గాలు ఏర్పరచి కూర్చున్న చెట్టునే నరుక్కోవద్దని హెచ్చరించారు. అంతకు ముందు జువ్వాడి రత్నాకర్‌రావు 98వ, జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయనవెంట ఏఎంసీ చైర్మెన్ లావుడ్య రూప్లానాయక్, వైస్‌చైర్మెన్ అరిగె లింగయ్యా, మాజీఏఎంసీ చైర్మెన్ కొత్త నర్సింహులు, మాజీఏఎంసీ వైస్ చైర్మెన్ కాడె సూర్యనారాయణ, మాజీ పీఏసీఎస్ చైర్మెన్ దేవి జనార్దన్, ధర్మపురి నియోజకవర్గ యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్, కొండగట్టు దేవస్థాన మాజీ డైరెక్టర్ జక్కుల దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండ కాంగ్రెస్ పార్టీ: ఎమ్మెల్యే



మక్కాన్‌సింగ్‌తో మాట్లాడుతున్న కాంట్రాక్టు కార్మికులు

గోదావరిఖని, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పేదలకు అండ కాంగ్రెస్ పార్టీ అని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. అంతర్గాం మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ సర్పంచ్ కుర్ర నూకరాజు, గీట్ల శంకర్ రెడ్డి, మడ్డి వెంకటేష్, కాంపెల్లి సంతోష్ శనివారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కాంగ్రెస్‌పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొంతల రాజేష్, మహంకాళి స్వామి, దీటి బాలరాజు, మారెల్లి రాజిరెడ్డి, అల్లి శంకర్, దాసరి విజయ్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులు ప్రభుత్వానికి పునాదిలాంటి వారు..

కాంట్రాక్టు కార్మికులు ప్రభుత్వానికి పునాది లాంటి వారని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంట్రాక్టు కార్మికులు మక్కాన్‌సింగ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సింగరేణి లాభాలవాటా నుంచి కాంట్రాక్టుకార్మికులకు రూ.5,500 ఇప్పించేందుకు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ చొరవ చూపడాన్ని అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల కష్టానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, భవిష్యత్‌లో మరిన్ని ప్రయోజనాలు కల్పించే దిశగా కృషి చేస్తామని తెలిపారు.

ఘనంగా దుర్గాదేవి శోభాయాత్ర



దుర్గాదేవి శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

కమాన్‌పూర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఛత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో శనివారం అమ్మవారి నిమజ్జన ఊరేగింపును అట్టహాసంగా చేపట్టారు. ఈసందర్భంగా దారి పొడవునా ఏర్పాటుచేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులు, ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం అమ్మవారిని నిమజ్జనం చేసి, తమ భక్తిని చాటుకున్నారు.

కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డును ఇంటింటికీ తీసుకెళ్తాం

● మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

8లో

జడ్పీటీసీ టిక్కెట్ నేతకాని సామాజిక వర్గానికి కేటాయించాలి

ప్రజాస్వామ్యం మనుగడకు జర్నలిస్టులు కీలకం

● రాష్ట్ర అసెంబ్లీ మీడియా అడ్వయిజరీ కమిటీ సభ్యుడు బుర్ర ఆంజనేయులుగౌడ్



రేణుక ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఆంజనేయులు

ఎలిగేడు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య వ్యవస్థలో జర్నలిస్టులే కీలకమని, అందుకే వారిని నాలుగవ స్తంభంగా వ్యవహరిస్తారని రాష్ట్ర అసెంబ్లీ మీడియా అడ్వయిజరీ కమిటీ సభ్యుడు బుర్ర ఆంజనేయులుగౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రానికి చెందిన ఆయనను పలువురు ఎలిగేడు మండల జర్నలిస్టు యూనియన్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు కొడూరి కైలాసం, కలువల శంకర్, ముంజంపల్లి కొమురయ్య, రంగు తిరుపతి, బుకాల సారయ్య, మద్దెల సంపత్, ఇరుగురాల ప్రశాంత్, తాటిపల్లి, ముత్యాల శ్రీధర్, చందు తదితరులు పాల్గొన్నారు. కాగా ఎలిగేడులో నూతనంగా నిర్మిస్తున్న మార్కండేయ ఆలయ నిర్మాణానికి ఆయన రూ.10వేలు విరాళంగా అందించారు. అనంతరం గ్రామంలో రేణుక ఎల్లమ్మ దేవతను కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. కార్యక్రమంలో పద్మశాలిసంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆ వార్డులో అందరూ బీసీలే

● కానీ ఎస్సీలకు రిజర్వ్ ఎలా? ● అధికారులను ఆశ్రయించిన గ్రామస్థులు

సుల్తానాబాద్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆ వార్డులో ఉన్న వాళ్లందరూ బీసీలే కానీ ఇటీవల స్థానికసంస్థల ఎన్నికల రిజర్వేషన్లకు సంబంధించి ఆ వార్డును ఎస్సీలకు రిజర్వు చేశారు అధికారులు. దీంతో గ్రామస్థులు తమ రిజర్వేషన్లు మార్చాలంటూ అధికారులను ఆశ్రయించారు. సుల్తానాబాద్ మండలం బొంతకుంటపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని మూడోవార్డులో అందరూ బీసీలే. ఒక్కరంటే ఒక్కరు కూడా ఎస్సీలు లేరని అయినా ఈ వార్డును ఎస్సీలకు ఎలా రిజర్వు చేస్తారంటూ ఆ గ్రామానికి చెందిన మాజీసర్పంచ్ ఆసరి రాజయ్యతోపాటు పలువురు యువకులు శనివారం సుల్తానాబాద్ మండల ప్రజాపరిషత్ అధికారులను ఆశ్రయించారు. ఈమేరకు ఎంపీడీవోకు ఒక దరఖాస్తును అందజేశారు. బొంతకుంటపల్లి గ్రామపంచాయతీ పరిధిలో 8 వార్డులు ఉన్నాయని, 760మంది ఓటర్లు ఉన్నారని అయితే మూడోవార్డు ఎస్సీలకు రిజర్వు చేసినట్లు అధికారులు గెజిట్ ప్రకటించారని, కానీ ఆవార్డులో పోటీచేయడానికి ఒక్క ఎస్సీ కూడా లేరని ఎంపీడీవోకు వివరించారు. తగిన విచారణ చేసి రిజర్వేషన్ మార్చి తమకు న్యాయం చేయాలంటూ వారు అధికారులను కోరారు. ఎంపీడీవోను కలిసిన వారిలో గ్రామానికి చెందిన ఆసరి సంపత్, రాజమల్లయ్య, దాసరి శ్రీనివాస్, తిరుపతి, బండి ఉదయ్ కిరణ్, శేఖర్, రవీందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మించారు.. నిర్లక్ష్యంగా వదిలేశారు..

● నిరుపయోగంగా ఉంటున్న కార్యాలయాలు
● శిథిలావస్థకు చేరుకుంటున్న వైనం



ఓదెలలో తాళం వేసి ఉన్న స్త్రీ శక్తి భవనం

ఓదెల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యంతో లక్షలాది రూపాయల ప్రజాసొమ్ము వృథా అవుతోంది. రూ.25లక్షలతో స్త్రీశక్తి భవనం, రూ.6లక్షలతో వ్యవసాయశాఖ భవనాన్ని నిర్మించారు. ఈ రెండు కార్యాలయాలు తాళాలు వేసి నిరుపయోగంగా ఉండడంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. వీటిని నిర్మించినప్పటి నుంచి ప్రారంభించలేదు. మండలపరిషత్ కార్యాలయంలో ఈజీఎస్ కార్యాలయాన్ని కొనసాగించారు. అనంతరం కార్యాలయంలో గదుల కొరత ఏర్పడడంతో స్త్రీశక్తి భవనంలోకి ఈజీఎస్ కార్యాలయాన్ని మార్చారు. కొన్నాళ్లపాటు సజావుగానే విధులు కొనసాగినప్పటికీ, దీనికి ప్రత్యేక కార్యాలయాన్ని కేటాయించలేదు, నిర్మించలేదు. దీంతో రెండేళ్ల క్రితం ఐకేపీ ఏపీఎం ఉన్నతాధికారులకు ఫిర్యాదు సమర్పిస్తూ, స్త్రీశక్తిభవనాన్ని ఐకేపీకి కేటాయించాలని కోరడంతో అందులో నుంచి ఈజీఎస్ సిబ్బందిని ఖాళీ చేయించారు. దీంతో ఈజీఎస్ కార్యాలయానికి మళ్లీ మండలపరిషత్ కార్యాలయంలోని గదిని కేటాయించారు. అయిన ప్పటికీ మహిళాభవన్‌లో ఎవరూ కూడా ఎలాంటి విధులు నిర్వహించకపోవడంతో రెండేళ్ల క్రితం కార్యాలయానికి తాళాలు వేసి ఉంచారు. అలాగే గత ప్రభుత్వంలో ఇక్కడ రైతువేదికను నిర్మించి రైతుసమావేశాలు సైతం నిర్వహించారు. డీఆర్డీయే గ్రాంట్ రూ.6లక్షలతో నిర్మించిన వ్యవసాయశాఖ కార్యాలయం ఖాళీ కావడంతో ప్రస్తుతం ఇదికూడా శిథిలావస్థకు చేరుకుంది. 2008సెప్టెంబరు 26న, ఈ కార్యాలయాన్ని అప్పటి కలెక్టర్ సందీప్‌కుమార్ సుల్తానియా, ఎమ్మెల్యే గీట్ల ముకుందరెడ్డి ప్రారంభించి వ్యవసాయశాఖ అధికారులకు కేటాయించారు. దీనిని గిడ్డంగికి అధికారుల విధుల నిర్వహణకు ఉపయోగించారు. రైతువేదిక నిర్మితం కావడంతో ఇది కూడా ప్రస్తుతం నిరుపయోగంగా మిగిలిపోయింది. లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ఈ రెండు కార్యాలయాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోకముందే గదులకొరత ఉన్న శాఖలకు కేటాయించి, ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



శిథిలం అవుతున్న వ్యవసాయ కార్యాలయం

● మండల పరిషత్ భవనంలో అన్నీ ఇరుకు గదులే..

ప్రస్తుతం మండలపరిషత్ కార్యాలయంలో ఏగది చూసినా ఉద్యోగులకు ఇరుకు సమస్యలే కనిపిస్తున్నాయి అంతకుముందు అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు కార్యాలయానికి వచ్చిన సందర్భంలో ఎవరి శాఖ గదికి వాళ్లు వెళ్లి కూర్చుండేవారు. ప్రస్తుతం గదుల కొరత అధికారులను వెంటాడుతున్నాయి.

● శిథిలావస్థకు చేరకముందే ఉపయోగంలోకి తేవాలి..

- దాసరి రాజన్న,
మాజీ సర్పంచ్, పొత్కపల్లి



మండల కేంద్రంలో నిర్మించిన మహిళా భవనం, అలాగే వ్యవసాయశాఖ భవనం పూర్తిగా ఉపయోగంలోకి తేవాలి. ఏ శాఖకు కొరత ఉందో ఆ శాఖ సంబంధించిన కార్యాలయానికి, లేదా విద్యుత్‌శాఖకు కేటాయించినట్లయితే రైతులకు అందుబాటులో ఉండే అవకాశాలు ఉన్నాయి.

చివరి మజిలీకి అవస్థలు


పదిరలో కొట్టుకుపోయిన శ్మశాన వాటిక

- కొట్టుకుపోయిన వైకుంఠధామాలు
- అంత్యక్రియలకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : జీవితం ఉన్నంత కాలం ఎన్నో కష్టాలను ఎదుర్కొన్న మనిషికి అఖరి మజిలీలోనూ అవస్థలు తప్పడం లేవు. ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వం నిర్మించిన శ్మశానవాటికల్లో సమస్యలు ఘోషిస్తున్నాయి. అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కనీస వసతులు లేక అతికష్టం మీద ముగిస్తున్నారు. పలు గ్రామాల్లోని శ్మశానవాటికలను వాగు సమీపంలో నిర్మించడం వల్ల మూడేళ్ల కిందట కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయాయి. గ్రామాలకు దూరంగా ఉండడంతో నిరుపయోగంగా మారాయి. ఉన్న కొన్ని శ్మశానవాటికల్లో వసతులు కరవయ్యాయి.

● వినియోగంలోకి రాకముందే..

మండల కేంద్రంతో పాటు పదిర, రాగట్లపల్లి, హరిదాస్‌నగర్, వెంకటాపూర్, రాచర్లతిమ్మాపూర్, అల్మాస్‌పూర్, దుమాల, అక్కపల్లి, తదితర గ్రామాల్లో సుమారు 30 స్మశాన వాటికలను ప్రభుత్వం నిర్మించింది. రాగట్లపల్లి, పదిరగ్రామాల్లో వాగు, ఒర్రె సమీపంలో పనులు చేపట్టడం వల్ల వినియోగంలోని రాక ముందే కొటుకుపోయాయి. దాంతో ఆ గ్రామాల ప్ర జలు ఎవరైనా చనిపోతే వాగు ఒడ్డుకు అంత్యక్రియా లు నిర్వహించాల్సి వస్తోంది. కొందరు వ్యవసాయ పొలాల వెంట పరుగులు తీయాల్సి వస్తోంది.


రాగట్లపల్లిలో ధ్వంసమైన గదులు

● సమస్యల తిష్ట

మండల కేంద్రంతో పాటు రాచర్లగొల్లపల్లి, అల్మాస్‌పూర్, దుమాల, అక్కపల్లి, కోరుట్లపేట, రాచర్లతిమ్మాపూర్, బాకురుపల్లితండా, గుంటపల్లిచెరువుతండా తదితర గ్రామాల్లో సుమారు కిలోమీటరు నుంచి 3 కిలోమీటర్ల దూరంలో శ్మశాన వాటికలను నిర్మించారు. కనీస వసతులను మర్చిపోయారు. విద్యుత్తు, నీటి వసతి లేక ఇబ్బందులు పడుతున్నారు. చీకట్లో అంత్యక్రియాలు నిర్వహించేందుకు కరెంటు సౌకర్యం లేక సెల్‌ఫోన్ టార్చ్‌లైటు వెలుతురులో ఇబ్బందులు పడుతున్నారు. స్నానాలు చేసేందుకు ట్యాంకర్లకు స్వంత డబ్బులను వెచ్చించాల్సి వస్తోంది. గ్రామాల్లో నిర్మించిన శ్మశానవాటికల్లో వసతులు కల్పించడంతో పాటు కొట్టుకుపోయిన వాటిని తిరిగి నిర్మించి ఆఖరి మజిలీ అవస్థలను తీర్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు తప్పడం లేదు

- బొల్లి ఎల్లయ్య, పదిర, ఎల్లారెడ్డిపేట



మా ఊరి చివరన ఉన్న చిటివాగు వద్ద స్మశాన వాటికలను నిర్మించారు. వానకు వాగు వచ్చి కొట్టుకుపోయింది. ఎవరైనా చనిపోతే వాగు ఒడ్డుకు నిర్వహిస్తున్నాం. శ్మశానవాటిక కట్టినా ఉపయోగం లేకుండాపోయింది. సార్లు పట్టించుకుని ఇబ్బందులు లేకుండా శ్మశానవాటికలను నిర్మించాలి.

సౌకర్యాలు కల్పించి సమస్యలను తీర్చుతాం..

- సత్తయ్య, ఎంపీడీవో, ఎల్లారెడ్డిపేట



మండలంలోని పలు గ్రామాల్లోని శ్మశానవాటికలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశిస్తాం. సమస్యలను గుర్తించి నివేదికలను సమర్పించాలని సూచిస్తాం. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా శ్మశానవాటికల్లో సౌకర్యాలు కల్పించి సమస్యలను తీర్చుతాం.

మళ్లీ.. గేటు పడితే ఎలా?



రైల్వే గేటు కింది నుంచి వస్తున్న వాహనదారులు

గంగాధర, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల-కరీంనగర్ ప్రధాన రహదారిపై మంగపేట సమీపంలోని రైల్వేగేటు ఈ వారంలో ఇప్పటికే మూడుసార్లు మొరాయించింది. దీంతో ఇరువైపులా కిలోమీటర్ మేర భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. శనివారం రైలు వస్తుందనగా అధికారులు రైల్వే గేటు వేశారు. రైలు వెళ్లగానే ద్విచక్రవాహనదారులు గేటు మళ్లీ మొరాయిస్తే ఆలస్యమవుతుందని తలచి తమ వాహనాలను ఒకవైపు వంచి గేటు దాటారు. దీన్ని గమనించిన తోటి వాహనదారులు పది నిముషాలు గేటు తెరచే వరకు ఆగలేరా అంటూ వారిని ప్రశ్నించారు. ఇప్పటికే మూడు మార్లు గేటు మొరాయించిందని, సాంకేతిక లోపం ఏర్పడి మళ్లీ గేటు ఎత్తకపోతే ఆఫీసుకు ఆలస్యమవుతుందని చెప్పుకుంటూ వెళ్లారు.

కేసు నమోదు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని కాపువాడలో బీజేపీ నాయకుడు ఆవుదుర్తి శ్రీనివాస్ ఫ్లెక్సీ ఏర్పాటు చేయగా, దానిని శుక్రవారం కొందరు వ్యక్తులు చింపి వేశారనే ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ వన్‌టౌన్ ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఫ్లెక్సీ చింపివేసిన ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

లారీ చోరీ కేసులో నాలుగు నెలల జైలుశిక్ష

కరీంనగర్ క్రైం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): లారీ దొంగతనం కేసులో నిందితుడు సయ్యద్ అలీకి కరీంనగర్ కోర్టు నాలుగు నెలల జైలుశిక్ష, 300 రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించిందని కొత్తపల్లి పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో రాజుకు చెందిన లారీని జనవరి 29న ఉత్తరప్రదేశ్‌కు చెందిన సయ్యద్ అలీ దొంగిలించాడని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, లారీని స్వాధీనం చేసుకోవటంతో పాటు నిందితుడి అరెస్టు, బలమైన సాక్షుల వాంగ్మూలాలను కోర్టులో సమర్పించినట్లు తెలిపారు. నిందితుడికి శిక్షపడటంలో కీలకంగా పనిచేసిన సీఐ ప్రదీప్‌కుమార్, ఎస్‌ఐ సాంబమూర్తి, కోర్టు కానిస్టేబుల్ మౌనికలను పోలీస్‌కమిషనర్ గౌస్ ఆలం అభినందించారు.

అతిగా మద్యం తాగి యువకుడి మృతి


కోడూరి రాజేశం(ఫైల్)

ఎలిగేడు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన కోడూరి రాజేశం(35) అనే యువకుడు అతిగా మద్యం తాగి మృతిచెందినట్లు ఏఎస్సై రామచంద్రం తెలిపారు. ఆయన కథనం మేరకు.. రాజేశంనకు ఏడాది క్రితం సౌందర్యతో వివాహం జరిగింది. భార్యాభర్తలు ఇద్దరు కరీంనగర్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో మద్యానికి బానిసగా మారిన రాజేశం, నిత్యం మద్యం సేవిస్తూ ఇష్టారీతిన ప్రవర్తించేవాడు. దసరాకు ఎలిగేడు వచ్చాడు. శుక్రవారం రాత్రి 10 గంటలకు మద్యం తాగడానికి బయటకు వెళ్లగా, శనివారం ఉదయం వరకు కూడా ఇంటికి రాలేదు. చుట్టుపక్కల వెతకగా ప్రభుత్వ ఉన్ని కేంద్రంలో మృతి చెంది ఉన్నట్లు గుర్తించారు. ఈమేరకు మృతుడు రాజేశం భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ప్రమాదంలో గాయపడిన బాలుడి మృతి

ఎన్‌టిపిసి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఐదు రోజుల క్రితం ఎన్టీపీసీ క్రషర్ నగర్‌లో జరిగిన విద్యుత్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సద్దాల గణేష్(16) అనే బాలుడు కరీంనగర్‌లో చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతిచెందాడు. విద్యుత్ లైన్లను సవరిస్తుండగా జరిగిన ప్రమాదంలో ముగ్గురు మైనర్లు గాయపడిన విషయం తెలిసిందే. తీవ్రంగా కాలిన గాయాల పాలైన గణేష్‌ను మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎన్టీపీసీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గంభీరావుపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం కోళ్లమద్ది గ్రామ సమీపాన అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపారు. కోళ్లమద్దికి చెందిన మధుసూదన్ అనే వ్యక్తి మానేరు వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుకను ట్రాక్టర్‌లో నింపుకుని అధిక ధరలకు విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇసుక ట్రాక్టర్‌ను సీజ్‌చేసి, అక్రమంగా ఇసుక తరలించిన వ్యక్తిని రిమాండ్‌ను తరలించినట్లు ఎస్‌ఐ అనిల్‌కుమార్ వివరించారు.

ధాన్యం రాశులను ఢీకొన్న ద్విచక్ర వాహనం.. ఒకరికి గాయాలు

చందుర్తి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండల కేంద్రం శివారులో ద్విచక్ర వాహనదారుడు ధాన్యం రాశులను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. చందుర్తి నుంచి మోత్కరావుపేట వెళ్లే రోడ్డు మార్గంలో ఓ రైతు ధాన్యాన్ని రోడ్డుపై ఆరబెట్టాడు. మండల కేంద్రానికి చెందిన రాపల్లి మొండయ్య అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ధాన్యం రాశులను ఢీకొని కింద పడిపోయాడు. దీంతో గాయపడ్డ మొండయ్యను చికిత్స నిమిత్తం స్థానికంగా ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రోడ్లపై రైతులు ధాన్యం ఆరబెడుతున్నందున వాహనదారులు జాగ్రత్త వెళ్లాలని మండల రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెంటయ్య కోరారు.

ఖనిలో యువకులపై దాడి

కోల్‌సిటీ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని అశోక్‌నగర్‌లో ఇద్దరు యువకులపై ముగ్గురు యువకులు దాడికి పాల్పడిన సంఘటన శనివారం రాత్రి జరిగింది. వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. అశోక్‌నగర్‌లోని ఒక రెడిమేడ్ షాపు వద్దకు తిలక్‌నగర్‌కు చెందిన అరవింద్ తనమిత్రులతో కలిసి వచ్చాడు.

షాపు మూసి ఉండడంతో బోర్డుపై ఉన్న సెల్‌నంబర్‌కు ఫోన్‌చేస్తుండగా అశోక్‌నగర్‌కు చెందిన కార్తీక్, గుండుంబ సందీప్‌తోపాటు మరో యువకుడు అరవింద్ స్నేహితులతో గొడవకు దిగి రాళ్లతో దాడి చేసుకున్నారు. దీంతో అరవింద్ కనుబొమ్మకు గాయం కాగా గోదావరిఖని ప్రభుత్వజనరల్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. దీనిపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకులకు గంజాయి నిర్ధారణ పరీక్షలు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం రంగంపేట గ్రామ శివారులో గంజాయి తాగుతున్నారనే సమాచారంతో తనిఖీలు నిర్వహించామని పోలీసులు శనివారం తెలిపారు. ఐదుగురు మద్యం తాగుతూ పట్టుబడ్డారని పేర్కొన్నారు. ఐదుగురు యువకులకు గంజాయి నిర్ధారణ పరీక్షలు జరిపామని చెప్పారు. అవగాహన కల్పించామని తెలిపారు. గంజాయి రవాణా, అమ్మకాలు, తాగుతున్న యువకుల కదిలికలపై నిఘా ఉంచామని పోలీసులు వివరించారు.

గీత కార్మికుడికి గాయాలు

రామగిరి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపేట్ గ్రామంలో ఈత చెట్టుపై నుంచి పడి గీతకార్మికుడికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన బిటుకు కొమురయ్యగౌడ్ ఈత చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు నిచ్చెన జారి పోవడంతో చెట్టు పైనుంచి కిందపడి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన కొమురయ్యను పెద్దపల్లికి తరలించారు. కొమురయ్య గౌడ్‌ని ఆదుకోవాలని గౌడ సంఘం నాయకులు కోరారు.

రహదారిపై కొండ చిలువ ప్రత్యక్షం


రోడ్డు పైనుంచి వెళుతున్న కొండ చిలువ

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామ శివారులోని మానేరు వాగు వంతెన వద్ద రహదారిపై శనివారం రాత్రి కొండచిలువ ప్రత్యక్షమైంది. రోడ్డు వెంట వెళుతున్న వాహనదారులు గమనించి భయాందోళనకు గురయ్యారు. చంపేందుకు ప్రయత్నించడంతో కొండచిలువ వేగంగా రోడ్డు దాటి పక్కన ఉన్న పొదల్లోకి వెళ్లిపోయింది. ఇటీవల కొండచిలువలు రోడ్లపైకి వస్తుండడం వల్ల ప్రయాణికులు ఆందోళనకు గురవుతున్నారు.

బస్సు వెనక బస్సు.. ప్రయాణికులకు తిప్పలు

సమయపాలన పాటించని అధికారులు


వేములవాడ వైపు ఒకదానివెనకాల ఒకటి వెళ్తున్న బస్సులు

కొడిమ్యాల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండల కేంద్రం మీదుగా జగిత్యాలకు నడిచే వేములవాడ డిపో బస్సులు ఒకదాని వెనక ఒకటి ఒకే వైపు నడుస్తుండటంతో ప్రయాణికులు తిప్పలు పడుతున్నారు. ఈ రూట్‌లో ఆర్టీసీ సౌకర్యం ప్రయాణికులకు అనుకూలంగా ఉన్నది. కొద్ది రోజులుగా బస్సు వెనుక బస్సు రావటంతో ప్రయాణికులు బస్సు కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. మండల కేంద్రమైన కొడిమ్యాల నుంచి ఆర్టీసీ బస్సు జగిత్యాల వైపునకు, వేములవాడ వైపునకు వెళ్లిన ఒక బస్సు వెనుక ఒక బస్సు వెళ్లటంతో ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిపో నుంచి బయలుదేరుతున్న బస్సులు సమయపాలన పాటిస్తే ప్రయాణికులకు ఎదురుచూపులు ఉండవని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత ఆర్టీసీ అధికారులు నిర్ణయించిన సమయానికి బస్సులు నడిచే విధంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అన్నపై తమ్ముళ్ల హత్యాయత్నం


గాయపడిన కొమురయ్య

మానకొండూర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వన్నారం గ్రామపంచాయతీ శివారు గ్రామమైన కొత్తపల్లికి చెందిన బోయిని కొమురయ్య అనే వ్యక్తిపై అతని తమ్ముళ్లు బోయిని ఆంజనేయులు, బోయిని లక్ష్మణ్‌లు పదునైన ఇనుప రాడ్డుతో శనివారం దాడికి పాల్పడ్డారు. స్థానిక సీఐ సంజీవ్ తెలిపిన వివరాల ప్రకారం కొత్తపల్లికి చెందిన కొమురయ్యకు ఇద్దరు అన్నలు ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారు. కొమురయ్యకు ఆంజనేయులు, లక్ష్మణ్‌ల మధ్య భూతగాద నడుస్తోంది.

శనివారం ఉదయం కొమురయ్య పొలం వద్ద పాలను పితకడానికి వెళ్తుండగా ఆంజనేయులు, లక్ష్మణ్‌లు పాత కక్షలను దృష్టిలో పెట్టుకొని కాపు కాసి పదునైన ఇనుపరాడ్డుతో వీపుపై దాడి చేశారు. తీవ్ర గాయాలతో వారి బారి నుంచి కొమురయ్య తప్పించుకొని ఇంటికి రావడంతో కుటుంబసభ్యులు, గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు చికిత్స నిమిత్తం 108 ద్వారా కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు కొము రయ్య భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్


మూల మలుపు వద్ద ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

మానకొండూర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్‌లోని తూర్పుదర్వాజ బస్టాండ్ మూలమలుపు వద్ద 20 ఏళ్ల క్రితం విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. కరీంనగర్ నుంచి జమ్మికుంట ప్రధాన రహదారి మానకొండూర్ తూర్పుదర్వాజ బస్టాండ్ మీదుగా ఆర్టీసీ బస్సులు, లారీలు, ఇతర వాహనాలు ప్రతీ నిత్యం వెళ్తుంటాయి. కరీంనగర్ నుంచి జమ్మికుంట వైపు తిరిగే మూలమలుపు వద్ద గతంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. డ్రైవర్ ఆదమరిస్తే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొనాల్సిందే. జమ్మికుంట వైపు వెళ్లే ప్రయాణికులు నిలబడడానికి అక్కడ స్థలం లేదు. ప్రయాణికులు వేరే స్థలంలో ఉండి బస్సు వచ్చే సమయంలో పరుగులు తీసి ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ప్రమాదం జరగకుండా జాలి ఏర్పాటు చేయలేదు. ఇరుకు స్థలం ఉండడంతో అనేక ప్రమాదాలు జరిగి పలువురు మృత్యువాత పడ్డారు. వాహనాల తాకిడి పెరగడమే కాకుండా మహలక్ష్మి పథకం ప్రవేశపెట్టినప్పటి నుంచి ప్రతీ బస్సులో సుమారు 120 మందికి పైగా ప్రయాణికులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు.

మహిళను బెదిరించిన సంఘటనలో .. వ్యక్తిపై కేసు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా స్థలం లో ప్రవేశించడంతో పాటు ఇంటి నిర్మాణం చేయకూడదని మహిళలను బెదిరించిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామానికి చెందిన వ్యక్తి చెరుకూరి రాజేశంపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి శనివారం పేర్కొన్నారు.

గ్రామంలోని మహిళ చెరుకూరి మంజుల గ్రామ శివారులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదుట తనకున్న స్థలంలో గ్రామ పంచాయతీ అనుమతిలో ఇంటి నిర్మాణం చేపట్టిందని తెలిపారు. పాత కక్షలను మనసులో పెట్టుకున్న రాజేశం ఈ నెల 3న పనుల వద్దకు చేరుకున్నారని చెప్పారు. నిర్మాణం చేయకూడదని పేర్కొంటూ అసభ్యపదజాలంతో దూషించడంతో పాటు చంపుతానని మహిళ మంజులను బెదిరించాడని పేర్కొన్నారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు రాజేశంపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

చెరువుల మరమ్మతులకు ఎదురుచూపులు

- సాగు నీటి సంఘాలు లేక నిర్వాహణ కరువు
- ఏటా వృథాగా పోతున్న సాగు నీరు



ధ్వంసమైన తక్కళ్లపల్లి పాడి చెరువు మత్తడి, గండి పడ్డ దుంపెట ఊర చెరువు


కథలాపూర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఏటా కురుస్తున్న భారీ వర్షాలకు చిన్న నీటి వనరులు ధ్వంసం కావడం వల్ల సాగు నీరంతా వృథాగా పోతోంది. ఏటేటా మరమ్మతులు చేస్తే చెరువులు, కుంటల్లో నీరు నిల్వ ఉండి భూగర్భ జలాలు పెరగడంతో పాటు పంటలు పండడానికి ఆస్కారం ఉంటుంది. ఇరిగేషన్ అధికారులకు చెరువులు, కుంటలు తెగిన సందర్భాల్లో రైతులు సమాచారం ఇస్తున్నప్పటికీ పరిశీలించి వెళ్లడం పరిపాటిగా మారుతోంది. ధ్వంసమైన వాటిని మరమ్మతులు చేయాలని పలుమార్లు కోరుతున్నా నిధులకు మాత్రం మోక్షం లభించడం లేదనే అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఉమ్మడి అంధ్రప్రదేశ్‌లో అప్పటి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో చెరువులు, కుంటలు, ప్రాజెక్టులపై పర్యవేక్షణ కోసం సాగు నీటి సంఘాలు ఏర్పాటు చేశారు. అప్పుడు పకడ్బందీగా చిన్న నీటి వనరులుతో పాటు మధ్య తరహా ప్రాజెక్టుల నిర్వాహణ ఆ సంఘాలే చేస్తుండేవి. తెలంగాణ ఏర్పడ్డాక బీఆర్‌ఎస్ ప్రభుత్వం పగ్గాలు చేపట్టాక సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో వాటి ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. చెరువుల, కుంటలు, ప్రాజెక్టుల కింద ఆయకట్టు ఉన్న రైతులతో సంఘం ఏర్పాటు చేసి చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకునేవారు. మరమ్మతులకు నిధులు మంజూరు చేయించుకుని తీర్మానం చేసుకున్నాక సదరు పనులు పూర్తి చేసుకునేది.

● మరమ్మతులకు నిధులు కరువు..

మండలంలో 16 చెరువుల కింద 7,687 ఎకరాలు, 58 కుంటల కింద 1,630 ఎకరాల ఆయకట్టు ఉంది. బొమ్మెన ప్రాజెక్ట్, గంభీర్‌పూర్ తాళ్ల చెరువు ప్రాజెక్ట్, రాళ్లవాగు ప్రాజెక్ట్, సూరమ్మ చెరువు ప్రాజెక్టులు ఉన్నాయి. ప్రతీ ఏటా ఏదో ఒకచోట చెరువులకు గండి పడడం, మత్తడి చెడిపోవడం, కట్టలపై ఏపుగా చెట్లుపెరగడం, తూములు లీకేజీలు వంటి సమస్యలు ఏర్పడుతుంటాయి. వీటి మరమ్మతుల కోసం నిధులు రాక ఏటా ఎదురుచూపులు తప్పడం లేదని ఆయకట్టుదారులు వాపోతున్నారు. రెండేళ్ల కిందట బొమ్మెన ప్రాజెక్ట్ కాలువల ఆధునికీకరణ, కట్టపై పొదల తొలగింపు, తూముల మరమ్మతుల కోసం ఐదు కోట్ల రూపాయలతో అంచనాలు తయారు చేసి నివేదికలు పంపినా నేటికీ నిధులకు మోక్షం లభించ లేదు. తుర్తి తీగలకుంట కట్టకు 3.16 లక్షల రూపాయలు, తక్కళ్లపల్లి కర్రోనికుంట కట్ట, మత్తడికి 13.52 లక్షల రూపాయలు, చింతకుంట వెంకటాద్రి కుంట మత్తడికి 5.92 లక్షల రూపాయలు, అంబారిపేట ఎర్రకుంట మత్తడికి 52 వేల రూపాయలు, సిరికొండ మల్లమ్మకుంట తూము, గైడ్‌వాల్ నిర్మాణాలకు 1.12 లక్షల రూపాయలతో ఇరిగేషన్ అధికారులు అంచనాలు వేసి అప్పటి ప్రభుత్వానికి పంపించారు. సాగునీటి సంఘాలు ఉంటే వాటిపై నిరంతరం పర్యవేక్షించి నిధుల కోసం ఎమ్మెల్యే, ఎంపీల వెంటబడి రాబట్టుకునేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. దీంతో చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల మరమ్మతులు సత్వరమే జరిగి నీరు వృథా పోకుండా నిల్వ చేసుకోడానికి వీలు కలుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

● సాగునీటి సంఘాలు ఏర్పాటు చేయాలి

వాకిటి రాజరెడ్డి, సాగునీటి సంఘం మాజీ చైర్మన్, భూషణరావుపేట



సాగునీటి సంఘాలను ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలి. చెరువు కట్టలపై చెట్లు, పొదలు పెరగడంతో పాటు మత్తడి, తూములు, కాలువలు ఏటా ధ్వంసం అవుతున్నాయి. సాగునీటి సంఘాలు ఉన్నట్లైతే వెనువెంటనే మరమ్మతులు చేసుకోడానికి ముందుకు వస్తాయి. నిధుల వినియోగం కూడా పకడ్బందీగా జరుగుతుంది. ఏ చిన్న సమస్య ఏర్పడ్డా సత్వరమే పూర్తి చేసుకుని నీటి వృథాను అరికట్టుకోవచ్చు. మరమ్మతుల కోసం నిధులు కూడా అధికంగా తెచ్చుకోడానికి వీలు కలుగుతుంది.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు సత్తా చాటాలి

- బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాష్



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాష్

గణేశ్‌నగర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ పార్టీలకు అతీతంగా బీసీలు సత్తా చాటాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు ఎన్నం ప్రకాష్ పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని మంకమ్మతోటలో బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో బీసీ సంఘాల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీలక తీతంగా బీసీలందరూ ఐక్యంగా ఉండి బీసీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన వాగ్దానం నిలుపుకొని, 42 శాతం జీవో అమలు కోసం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బీసీలకు చట్టబద్ధమైన రిజర్వేషన్లు కల్పించాలని, ఒకవేళ జీవో అమలు కాకపోతే, రాజకీయ పార్టీల ప్రకారంగా బీసీ రిజర్వేషన్లు అంటూ కాంగ్రెస్ మాయ మాటలు చెప్పే ప్రమాదం కూడా ఉందని దీనిని అన్ని రాజకీయ పార్టీల బీసీల నాయకులు గమనించాలని కోరారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీ ఇదే ఎజెండాతో వస్తే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు డిపాజిట్ రాకుండా చేస్తామన్నారు. కోర్టులో జీవో అమలు కోసం కాంగ్రెస్ ప్రయత్నం చేయాలని డిమాండ్ చేశారు. జనరల్ స్థానాలలో కూడా బీసీల సత్తా చాటాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగు సంపత్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దోగ్గలి శ్రీధర్, రాచమల్ల రాజు,సురేందర్, బండారు మల్లయ్య, నల్లవెల్లి రవి, మదాసు సంజీవ్, నారోజు రాకేష్ చారి తదితరులు పాల్గొన్నారు.

కోడ్ కూసింది





- నగదు, బంగారం తరలింపుపై ఆంక్షలు
- రూ. 50 వేలకు మించి తరలిస్తే ఆధారాలు చూపాల్సిందే..
- రూ. 10 లక్షల దొరికితే ఐటీకి అప్పగింత
- పోలీసుల తనిఖీలు ముమ్మరం

కరీంనగర్ క్రైం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికల నగారా మోగింది. రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేయడంతో తక్షణమే కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో అంతర్ జిల్లా ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఎన్నికల నిబంధనల ప్రకారం తనిఖీల సమయంలో ఒక వ్యక్తి వద్ద 50 వేలకు మించి నగదు లభిస్తే ఆ డబ్బులకు తగిన ఆధారాలు చూపాల్సి ఉంటుంది. లేదంటే ఆ డబ్బులను సీజ్ చేస్తారు. ముఖ్యంగా నగదు, బంగారం ఇతర వస్తువుల తరలింపుపైనా ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. పోలీసులు, ప్రత్యేక టీంల తనిఖీల్లో సాధారణ ప్రజలు నగదు, బంగారం, వెండికి సంబంధించి సరైన పత్రాలు చూపించకుంటే వాటిని సీజ్ చేస్తారు. పట్టుకున్న డబ్బులపై ఎలాంటి ఆక్షేపణలు లేకపోతే, వారం రోజుల్లో ఆధారాలు చూపిస్తేనే వాటిని తిరిగి ఇచ్చే అవకాశం ఉంటుంది.

● ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టుల ఏర్పాటు

జిల్లాలో ఆరు చోట్ల ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎన్నికల అధికారులు, పోలీసులు, టాస్క్‌ఫోర్స్, సర్వలైన్‌టీం సిబ్బంది తనిఖీలు చేస్తుంటారు. ఈ క్రమంలో స్థానికంగా, ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి వచ్చే వారు ఎటువంటి సమస్యలు ఎదుర్కోకుండా ఉండాలంటే తీసుకెళ్తున్న నగదు, బంగారం, వెండికి సంబంధించిన తగిన ఆధారాలు, ధ్రువపత్రాలను వెంటే ఉంచుకోవడం ఉత్తమం.

● సమావేశాలకు అనుమతి తప్పనిసరి

రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎక్కడైనా సమావేశాలు నిర్వహించాలంటే ముందుగానే స్థానిక పోలీస్ అధికారులకు సమాచారం ఇవ్వాలి. సమావేశం ఎప్పుడు నిర్వహిస్తున్నాం, ఎక్కడ నిర్వహిస్తున్నాం వంటి వివరాలన్నీ ముందుగా తెలియజేస్తే పోలీస్ వ్యవస్థ అందుకు తగ్గ ఏర్పాట్లు చేస్తుంది. సమావేశంలో లౌడ్ స్పీకర్లు వాడాలనుకుంటే అధికారుల నుంచి ముందుగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.

ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహిస్తే దానికి సంబంధించిన సమాచారం ముందుగానే పోలీసులకు ఇవ్వాల్సి ఉంటుంది. ర్యాలీ ఎక్కడ మొదలవుతుంది, ఏ మార్గంలో వెళ్తుంది, ఎన్నింటికి మొదలవుతుంది, ఎన్నింటికి, ఎక్కడ ముగుస్తుందన్న విషయాలు స్పష్టంగా తెలియజేయాలి. ర్యాలీ నిర్వహించే సమయంలో మార్గం మార్చడం వంటివి చేయరాదు. ర్యాలీ సాగే మార్గంలో అప్పటికే ఏవైనా నిషేధాజ్ఞలు ఉంటే నిర్వాహకులు దాన్ని పాటించాల్సి ఉంటుంది. ఒకే ప్రాంతంలో, ఒకే సమయంలో వేర్వేరు పార్టీలు కానీ వేర్వేరు అభ్యర్థులు కానీ ర్యాలీలు నిర్వహించాలనుకుంటే రెండు కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇందుకు తగిన సర్దుబాటు కోసం అవసరమైతే స్థానిక పోలీసుల సహకారం తీసుకోవాలి. ర్యాలీలు, సభలు, సమావేశాల వల్ల ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలి, అందుకు అవసరమైతే పోలీసుల సహాయం తీసుకోవాలి. ఇతర పార్టీల నాయకులు, అభ్యర్థులను పోలిన దిష్టిబొమ్మలను తీసుకెళ్లడం, అలాంటివి తగలబెట్టడం నిషేధం.

● తీసుకోవాల్సిన జాగ్రత్తలు

సాధారణ ప్రజలు నగదుతో ప్రయాణించే సమయంలో ఎన్నికల నిబంధనలను పాటిస్తూ కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ఎలాంటి సమస్య ఉత్పన్నం కాదు. విద్యాసంస్థలో ఫీజు చెల్లించడం, ఆసుపత్రుల్లో బిల్లు చెల్లించడం, పెళ్లిల్లు, ఇతర శుభకార్యాలు, వ్యాపారులు, ఇతరత్రా అవసరాలకు అధిక మొత్తంగా నగదు తీసుకెళ్తున్న వారు తగిన ఆధారాలు బ్యాంక్ పాస్‌బుక్, విత్‌డ్రా రశీదు, ఇతర బిల్లులు వెంట తీసుకువెళ్లాలని అధికారులు సూచిస్తున్నారు. అవసరాల కోసం బ్యాంకు ఖాతా నుంచి నగదు విత్‌డ్రా చేసిన సమయంలో సంబంధిత ఖాతా పాస్ బుక్, ఏటీఎం రశీదులు తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలి. ఆసుపత్రులకు డబ్బులతో వెళుతున్నవారు పేషెంట్ రిపోర్టులు, ఆసుపత్రి రశీదులు, ఇతర డాక్యుమెంట్లు తమ వెంట ఉంచుకోవాలి. వ్యాపారులు, రైతులు వస్తువులు, ధాన్యం, భూముల విక్రయంకు సంబంధించిన డబ్బు అయితే సంబంధించిన బిల్లులు, ల్యాండ్ డాక్యుమెంట్లు వెంట ఉంచుకోవాలి. బంగారం, ఆభరణాలు కొనుగోలు సమయంలో రశీదులు వెంట ఉంచుకోవాలి. వ్యాపారం, ఇతర సేవల కోసం డబ్బు వినియోగిస్తే తనిఖీల సమయంలో లావాదేవీల వివరాలను ఆధారాలతో అధికారులకు చూపించాలి. వ్యక్తుల శరీరంపై ఉన్న ఆభరణాలకు ఎలాంటి అంక్షలు ఉండవు. 10 లక్షలపైగా నగదు లభ్యమైతే ఐటీ, జీఎస్టీ అధికారులు కూడా రంగంలోకి దిగుతారు. వాటికి సంబంధించి కచ్చితమైన ఆధారాలు చూపిస్తేనే తిరిగి ఆ డబ్బులు ఇస్తారు. తనిఖీల్లో పట్టుకున్న నగదు, బంగారం, వెండి, ఇతర వస్తువులన్నింటిని జిల్లా ట్రెజరీలో భద్రపరుస్తారు. స్క్రీనింగ్ కమిటీ, ఆదాయపన్నుశాఖ అధికారులు రిలీజింగ్ ఆర్డర్ ఇస్తేనే ఆ డబ్బులు, వస్తువులు అప్పగిస్తారు.

రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలి

- రేవా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కోహెడ చంద్రమౌళి

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ చేసిన(రిటైర్డ్) ఉద్యోగులు, ఉపాధ్యాయుల బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్(రేవా) ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కోహెడ చంద్రమౌళి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా విశ్రాంత ఉపాధ్యాయ సంఘం భవనంలో రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ మల్లారపు పురుషోత్తం అధ్యక్షతన జిల్లాస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రేవా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చంద్రమౌళి మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులు, ఉపాధ్యాయుల బెనిఫిట్స్‌ను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 7న రేవా ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. తలపెట్టామన్నారు. ఏడదిన్నర కాలంలో ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు రావాల్సిన జీపీఎఫ్, జీఐఎస్, లీవ్ ఎన్కాష్మెంట్, కమ్యూటేషన్, గ్రాట్యూటీ అందలేదని విమర్శించారు. ఉద్యోగ విరమణ చేశాక వెంటనే రావల్సిన బకాయిలు అందించక పోవడంతో పెన్షనర్లు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఇలాంటి పరిస్థితులు ఉండేవి కావని ఈ విషయంపై ప్రభుత్వానికి రేవా ఆధ్వర్యంలో విన్నవించుకున్నా పెడచెవిన పెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలు చెల్లించేవరకు పోరాటాలు చేయాలని అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షకు కూడా సిద్ధం కావాలన్నారు. మంగళవారం కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాకు జిల్లా సంఘం సభ్యులు, విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రేవా ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకిశాల ప్రభాకర్‌రావు, ఉపాధ్యక్షుడు గద్దె జగదీశ్వర చారి, కోశాధికారి కనపర్తి దివాకర్, జిల్లా కమిటి సభ్యులుదేవనపెల్లి పరమేష్, ధర్మయ్య, అంజయ్య, మద్దికుంట లక్ష్మన్, తిరపతి, వెంకటేశ్వర్లు, దేవయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రేవా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చంద్రమౌళి

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



రాజన్న దర్శనానికి క్యూలైన్‌లో వేచిఉన్న భక్తులు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆయా క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకుని శ్రీపార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. రాజన్నకు ఎంతో ప్రీతిపాత్రమైన కోడెమొక్కును చెల్లించుకున్నారు. పరివార దేవతాలయాల్లో కుంకుమ పూజలో పాల్గొని తరించారు.

కొండగట్టులో..



కొండగట్టు అంజన్న ఆలయంలో భక్తులు

మల్యాల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజన్న సన్నిధానం శనివారం భక్తులతో సందడిగా మారింది. వేలాదిగా భక్తులు అంజన్నను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో స్వామి వారికి అభిషేకాలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు, పోలీసులు పర్యవేక్షించారు. భక్తుల రద్దీ రోజంతా కొనసాగింది.

ధర్మపురి క్షేత్రంలో..

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. స్థానిక లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ ఉగ్ర నరసింహ, వేంకటేశ్వర, రామలింగేశ్వర స్వామి, గణపతి ఆలయాల్లో ఉదయం ఆలయ వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు భక్తులు గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు. ఆలయాలకు చేరుకుని అభిషేకం, అర్చన, హోమం, నిత్య కళ్యాణం టిక్కెట్లు కొనుగోలు చేసి పూజలు చేయించారు. భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. ఆలయం పక్షాన ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ధర్మకర్తలు, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంపత్‌కుమార్, సంతోష్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సూర్యప్రభ, చంద్రప్రభ వాహనంపై శ్రీవారి ఊరేగింపు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగా వైభవంగా సాగుతున్నాయి. శనివారం శ్రీవారు సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాలపై పట్టణ పురవీధుల గుండా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయం దేవాలయంలో పూజారులు లక్ష్మీవేంకటేశ్వర స్వామికి ఆరాధన, సేవాకాలం, బాలభోగం, నివేదన నిర్వహించి తీర్థప్రసాదాలను భక్తులకు వితరణ చేశారు. అనంతరం పురవీదుల గుండా శ్రీవారు సూర్యప్రభ వాహనంపై రంగనాయక తిరుప్పోలం అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

సాయంత్రం దేవాలయంలో సామూహిక విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం జరిగింది. అనంతరం శ్రీవారిని చంద్రప్రభ వాహనంపై పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించగా మహిళలు మంగళ హారతులతో స్వామి వారిని దర్శంచుకున్నారు. కార్యక్రమంలో దేవాలయం కార్యనిర్వాహణాధికారి మారుతిరావు, దేవాలయం మాజీ చైర్మన్లు, సిబ్బంది, అర్చకులు, భక్తులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సూర్యప్రభ వాహనంపై దర్శనం ఇస్తున్న శ్రీవారు

ఘనంగా దీప యజ్ఞం.. సుహాసినిల కలశ యాత్ర

తంగళ్లపల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం పద్మనగర్ శివారులోని శ్రీ గాయత్రి పరివార ఆశ్రమం అధ్వర్యంలో నిర్వహిస్తున్న దీప యజ్ఞం కార్యక్రమంలో భాగంగా శనివారం తంగళ్లపల్లి గ్రామంలో సుహసినిల చేత కలశ యాత్ర ఘనంగా నిర్వహించారు. మార్కండేయ ఆలయం నుంచి గ్రామ పుర వీధుల్లో కలశ యాత్ర కొనసాగింది. అనంతరం గాయత్రి ఆశ్రమంలో సామూహిక దీపాలు వెలిగించి దీప యజ్ఞం చేశారు. అలాగే ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు నవరాత్రి పూర్ణాహుతి, 24 కుండీల గాయత్రి గీతా మహా యజ్ఞ పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు గాయత్రి ఆశ్రమ నిర్వహకులు బాదం ప్రకాశ్-గిరిజా దంపతులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు గజభీంకర్ రాజన్న, రాపెల్లి ఆనందం, యాదగిరి, శంకర్, మధు తదితరులు పాల్గొన్నారు.



కలశ యాత్రలో పాల్గొన్న మహిళలు

ప్రయాణికుల రద్దీని పరిశీలించిన జోన్ ఈడీ



రద్దీని పరిశీలిస్తున్న అధికారులు

భగత్‌నగర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీని ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ పగిడిమర్రి సోలమన్, ఆర్ఎం బిరాజు పరిశీలించారు. కరీంనగర్ బస్‌స్టేషన్‌లో బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకుని ప్రయాణికుల రద్దీని పర్యవేక్షించారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బస్సులను అందుబాటులో ఉంచాలని కరీంనగర్ బస్‌స్టేషన్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ ఎల్ మల్లేశంనకు సూచించారు. కార్యక్రమంలో కరీంనగర్ డిప్యూటీ మేనేజర్ ఎస్ భూపతిరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్ నుంచి 25,000 క్యూసెక్కులు దిగువకు..

జగిత్యాల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌కు వరద నీరు రావడం శనివారం కొనసాగిందది. 9 గేట్లు పైకి ఎత్తి 25,000 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 60,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.053 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

మారనున్న రాజన్న ఆలయ ముఖచిత్రం

- శరవేగంగా విస్తరణ పనులు - భీమన్న ఆలయంలో దర్శనాలకు ఏర్పాట్లు





రాజన్న ఆలయంలో కొనసాగుతున్న కూల్చివేత పనులు, భీమేశ్వర ఆలయంలో కోడెమొక్కులకు ధ్వజస్తంభం ప్రతిష్ఠిస్తున్న అర్చకులు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న ఆలయ ముఖచిత్రం త్వరలో మారనుంది. దీంతో పట్టణ ప్రజలు, భక్తుల ఎన్నోఏళ్ల కల సాకారం కానుంది. మూడు దశల్లో 35 ఎకరాల్లో 2027 సంవత్సరం వరకు సర్వాంగసుందరంగా, ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. స్థానిక శాసనసభ్యుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో రూ.150 కోట్ల నిధులతో అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి భూమిపూజ నిర్వహించారు. మొదటి దశ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. మూలవాగు బ్రిడ్జి సమీపం నుంచి రాజన్న ఆలయం వరకు 80ఫీట్ల రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఇళ్ల కూల్చివేతలు పూర్తయ్యాయి.

● తాత్కాలిక దర్శనాలకు..

రాజన్న ప్రధాన ఆలయంలో భక్తులకు దర్శనాలను నిలిపివేసి స్థానిక భీమేశ్వరస్వామి ఆలయంలో తాత్కాలికంగా భక్తులకు దర్శనాలు కల్పించేందుకు పనులు వేగంగా జరుగుతున్నాయి. పలురకాల మొక్కులకు సంబంధించిన షెడ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. ప్రసాదాల తయారీ గోదాంను వేద పాఠశాలలోకి, వేదపాఠశాలను భగవంతరావునగర్‌లోని శివస్వాముల భవనంలోకి మార్చుతున్నారు. ప్రధాన గోదాంను భీమేశ్వర సదన్‌లోని క్యాంటీన్‌లోకి మార్చనున్నట్లు తెలిపారు. ఆలయ ప్రధానకార్యాలయం, పీఆర్వో, ఈవో, ఇంజనీరింగ్ విభాగాలను భీమేశ్వర సదన్‌లోని మొదటి అంతస్తు, విచారణ కార్యాలయంలోకి మార్చనున్నట్లు ఈవో రమాదేవి తెలిపారు.

చరిత్రలో నిలిచేలా ఆలయ అభివృద్ధి..



- ఆది శ్రీనివాస్, ప్రభుత్వ విప్

చరిత్రలో నిలిచిపోయేలా రాజన్న ఆలయ అభివృద్ధిని సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో చేయబోతున్నాం. శృంగేరీ పీఠాధిపతుల సలహాలు, సూచనల మేరకు ఆలయ విస్తరణ పనులు సాగుతున్నాయి. గత ప్రభుత్వం రాజన్న ఆలయాన్ని పట్టించుకోలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రాజన్న ఆలయ అభివృద్ధిపై దృష్టిసారించింది.

వేగంగా పనులు జరుగుతున్నాయి..



- రమాదేవి, రాజన్న ఆలయ ఈవో

రాజన్న ఆలయ విస్తరణ అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. ఆలయంలోని కళాభవన్, ఎన్టీఆర్ గెస్ట్‌హౌస్‌తో పాటుగా ఈవో కార్యాలయం కూల్చివేశాం. భీమేశ్వర ఆలయంలో పనులు వేగంగా జరుగుతున్నాయి. పూర్తయిన వెంటనే దర్శనాలను భీమన్న ఆలయంలోకి మారుస్తాం.

ముగిసిన శరన్నవరాత్రోత్సవాలు



ఇల్లందకుంటలో ప్రత్యేక పూజలు చేస్తున్న సిబ్బంది

ఇల్లందకుంట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీరామ శరన్నవరాత్రోత్సవాలు శనివారం నిత్య కల్యాణంతో ముగిశాయి. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం పెద్దఎత్తున అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఇంగిలే రామారావు, ధర్మకర్తలు కిరణ్, రాంరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ మల్లారెడ్డి, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

పల్లెల్లో ఎన్నికల సందడి..

(5వ పేజీ తరువాయి)

మొదలయ్యింది. రిజర్వేషన్లు అనుకూలంగా ఉన్నటువంటి అధికార కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్, బీజేపీ ద్వితీయ శ్రేణినాయకులు టిక్కెట్లకోసం పార్టీ అధ్యక్షులు, నాయకుల చుట్టూ తిరుగుతున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు అప్పుడే సందడి చేస్తున్నారు. గ్రామాల్లో ఉండే పురప్రముఖులు, కులసంఘాల నాయకులు, ఓటర్లను ప్రభావితం చేసే వారిని కలుస్తూ తమ మద్దతు తనకే ఉండాలని, తమ ఆశీస్సులు కావాలంటూ అభ్యర్థిస్తున్నారు. అధికారకాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు తమపార్టీ క్యాడర్‌ను ఎన్నికలకోసం అప్రమత్తం చేస్తున్నారు. ఈనెల 8వతేదీన హైకోర్టు 42శాతం బీసీలకు కల్పించిన రిజర్వేషన్లకు అనుకూలంగా తీర్పువస్తే మరుసటిరోజే ఎన్నికల నోటిఫికేషన్లు జారీ కానున్నాయి.

● మొదలైన కప్పదాట్లు..

ఎన్నికలు సమీపిస్తుండడంతో ఆయాపార్టీల్లో కప్పదాట్లు మొదలయ్యాయి, రిజర్వేషన్లను అనుసరించి అభ్యర్థులు లేనిచోట్ల ఇతరపార్టీలకు చెందిన నాయకులకు ఆయాపార్టీలకు చెందిన వాళ్లు వల వేస్తున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు ఆపరేషన్ ఆకర్ష్‌కు తెర తీశారు. అంతర్గాం మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు గీట్ల శంకర్ రెడ్డి, అంతర్గాం మాజీసర్పంచ్ కుర్రవెంకటమ్మ, నూకరాజు శనివారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ సమక్షంలో కాంగ్రెస్‌పార్టీలో చేరారు. పార్టీ టిక్కెట్లుఆశించి భంగపడే నాయకులు తమఅదృష్టాన్ని పరీక్షించుకునేందుకు పార్టీలు మారేందుకు వెనుకాడరని తెలుస్తున్నది. పంచాయతీ ఎన్నికల కోసం ఏడాదిన్నరగా కొందరు, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో పోటీచేసేందుకు ఏడాదిగా కొందరు ఎదురు చూస్తున్నారు. ఈ ఎన్నికల్లో తాడోపేడో చూసుకోవాలని చూస్తున్నారు. కొందరు ద్వితీయశ్రేణి నాయకులు వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని చూస్తు న్నారు. నోటిఫికేషన్లు జారీ అయ్యే వరకు కప్పదాట్లు మరిన్ని పెరిగే అవకాశాలున్నాయి. అన్ని పార్టీల నాయకులు కప్పదాట్లను ప్రోత్సహిస్తున్నారు.

జడ్పీటీసీ టిక్కెట్ నేతకాని సామాజిక వర్గానికి కేటాయించాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నేతకాని మహర్ సంఘం నాయకులు

కళ్యాణ్‌నగర్/పాలకుర్తి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పాలకుర్తి జడ్పీటీసీ స్థానాన్ని నేతకాని సామాజికవర్గానికి కేటాయించాలని నేతకాని మహర్ సంఘం రాష్ట్రఅధ్యక్షుడు దుర్గం రాజేష్, సలహాదారుడు దుర్గం నర్సయ్య రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌ను కోరారు. శనివారం ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిపి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాలకుర్తి మండలంలో నేతకాని జనాభా అత్యధికంగా ఉందని, ఆ సామాజికవర్గానికి చెందిన గొల్లెరాజ్ కుమార్‌కు కాంగ్రెస్‌పార్టీ జడ్పీటీసీటిక్కెట్ కేటాయించాలని అన్నారు. దీనికిఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో కామెరప్రకాష్, దుర్గం నరేష్, జాడితిరుపతి, సత్యనారాయణ, లింగయ్య, శ్రీనివాస్, గంగాజలం, చంద్రశేఖర్, శేఖర్ ఉన్నారు.

కాన్షీరాం వర్ధంతిని జయప్రదం చేయాలి: బీఎస్పీ

● కరపత్రాలు విడుదల చేసిన నాయకులు

పెద్దపల్లి టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని బీఎస్పీ కార్యాలయంలో ఈ నెల9న నిర్వహించే కాన్షీరాం 19వ వర్ధంతిని పార్టీశ్రేణులు, బహుజనులు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి వరికిళ్ళ మల్లేష్, జిల్లాఅధ్యక్షుడు ఇరుకుల్ల రాజనర్సయ్య పిలుపునిచ్చారు. శనివారం వర్ధంతి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బహుజనుల రాజ్యాధికార ప్రదాత, భారత సామాజికశాస్త్రవేత్త, బడుగుల ఆశాజ్యోతి, బీఎస్పీ వ్యవస్థాపకులు కాన్షీరాం ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కలిసి రావాలని కోరారు. బహుజనులను రాజకీయంగా చైతన్యం చేసి అధికారం వైపు నడిపి ఉత్తర ప్రదేశ్‌లో బీఎస్పీని అధికారంలోకి తెచ్చి అట్టడుగు వర్గాలకు మేలు చేసినవ్యక్తి కాన్షీరాం అని కొనియాడారు. కాన్షీరాం వర్ధంతి కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, బహుజనులందరు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షుడు గొట్టే రాజు, జిల్లా ప్రధానకార్యదర్శి కాంపెల్లి బాబు, మంథని నియోజకవర్గ ఇన్‌చార్జీ జనగామ రవికుమార్, రామగుండం అసెంబ్లీ ఇన్‌చార్జీ జింక ఉదయ్, పెద్దపల్లి అసెంబ్లీ అధ్యక్షుడు బొంకూరి దుర్గయ్య, ప్రధాన కార్యదర్శి సాతురి అనిల్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఘనంగా సద్దుల బతుకమ్మ


రాజారంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, యువతులు

ధర్మపురి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని రాజారం, జైనా, దొంతాపూర్, ఆరెపల్లి, కొసునూర్‌పల్లె తదితర గ్రామాల్లో శనివారం బతుకమ్మ (సద్దుల) నిమజ్జనం వేడుకలు ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి అందంగా అలంకరణ చేశారు. సాయంత్రం వేళలో నూతన వస్త్రాలు ధరించిన మహిళలు, యువతులు నెత్తిమీద బతుకమ్మలు పెట్టుకుని గ్రామ కూడలి వద్దకు చేరుకున్నారు. అక్కడినుంచి మంగళ వాయి ద్యాలు వెంట రాగా దారి పొడవుగా గౌరీ దేవి, భక్తిపాటలు పాడుతూ, కోలాట నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. సాంప్రదాయ రీతిలో పరిసర గోదావరి నది, చెరువు, కుంటల వద్ద ప్రదక్షిణాలు చేస్తూ పాటలు పాడుతూ బతుకమ్మ ఆటలు ఆడారు. అనంతరం గోదావరి నదిలో, చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. పరస్పరం వయనాలు స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు సౌళ్లసత్యవ్వ, కుంట రజిత, రాంటెక్ చందన, కుంబాల రవిత, టీఆర్ఎస్ మండల మహిళా అధ్యక్షురాలు ర్యాగల్ల శ్యామల, మాజీ సర్పంచ్ శారద, జెల్ల లక్ష్మి, రంగు భవాని, భారతి, పద్మ, విజయ, స్వశక్తి సంఘాల మహిళలు, యువతులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ధర్మపురి మాజీ ఎంపీపీ సౌళ్ల భీమయ్య, జైనా పీఏసీఎస్ చైర్మన్ సౌళ్ల నరేష్, దొంతాపూర్, కొసునూర్‌పెల్ల మాజీ సర్పంచులు కొండపెల్లి రాంచందర్‌రావు, ఎన్నం లక్ష్మారెడ్డి తదితరులు బతుకమ్మ ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ధర్మపురిలో ఘనంగా మాజీ మంత్రి జువ్వాడి జయంతి

ధర్మపురి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలో దివంగత మాజీమంత్రి జువ్వాడి రత్నాకర్ రావు 98వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జువ్వాడి తనయుడు దేవస్థానం మాజీచైర్మన్, రాష్ట్రకాంగ్రెస్ నాయకుడు జువ్వాడి నవనీత కృష్ణారావు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ పలువురు కాంగ్రెస్, నేతలు, కార్యకర్తలు దివంగత మాజీమంత్రి జువ్వాడి రత్నాకర్‌రావు కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జువ్వాడి తనయుడు నవనీత కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ముందు వరుసలో నిలిచిన ఎమ్మెల్యేగా ఆయన గుర్తు చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేయాలి

హుజూరాబాద్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి విజయాన్ని సాధించాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. శనివారం హుజూ రాబాద్ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులను గుండెల్లో పెట్టుకొని చూసుకున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అదే గుండెలమీద తన్నిందన్నారు. హుజూరాబాద్ గడ్డ ముమ్మాటికి బీఆర్ఎస్ అడ్డాఅని, ఇక్కడ ఏ ఎన్నిక వచ్చిన బీఆర్ఎస్ గెలుపు తథ్యమన్నారు. రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్‌లు, మున్సిపల్ ఎన్నికల్లో హుజూరాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ జెండాఎగరవేసి తీరుతామన్నారు. సమావేశంలో ఎస్సీకార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, సింగిల్‌విండోచైర్మన్లు ఎడవెల్లి కొండాల్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రాణి, నాయకులు రామారావు, పాల్గొన్నారు.

● **వీణవంక:** స్థానికసంస్థల ఎన్నికలలో బీఆర్ ఎస్ పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు పనిచేయలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పిలుపు నిచ్చారు. శనివారం వీణవంక మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. వల్భాపూర్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్ ఎస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు పరిపాటి రవీందర్‌రెడ్డి, ముసిపట్ల తిరుపతిరెడ్డి, మాడసాధవరెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డును ఇంటింటికీ తీసుకెళ్తాం

● మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

మంథని, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికారం కోసం కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లటానికి బీఆర్ఎస్‌పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శ్రీకారం చుట్టిన కాంగ్రెస్ బాకీ కార్డును మంథని నియోజకవర్గంలోని ఇంటింటికి తీసుకెళ్తామని మాజీఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధు వెల్లడించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మోసాలను గడపగడపకూ తీసుకెళ్లి ప్రజలను చైతన్యవంతులను చేస్తామన్నారు. ఈమేరకు కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డు పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో భూపాలపల్లి మాజీ జడ్పీ చైర్మన్ జక్కు శ్రీహర్షిని-రాకేష్, ఏగోళపు శంకర్‌గౌడ్, మిర్యాల ప్రసాద్‌రావు, కనవేన శ్రీనివాస్, మండల పార్టీల అధ్యక్షులు, మహిళా నేతలు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

గన్నేరువరం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాషాయ జెండా రెపరెపలాడేలా బీజేపీ సత్తాచాటాలని జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం మండలకేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్ అధ్యక్షతన పార్టీ ముఖ్యనాయకులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ ఆశావహులతో నిర్వహించిన సమావేశానికి ఆయనహాజరై మాట్లాడారు. స్థానికసంస్థల ఎన్నికల కోసం పార్టీశ్రేణులంతా సిద్ధంకావాలని అన్నారు. బీజేపీ మోదీ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షే మం కోసం కట్టుబడి పనిచేస్తున్నదని అన్నారు. నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండి అడ్డగోలుగా రాష్ట్రాన్ని దోచుకుందని విమర్శించారు.

బ్రహ్మోత్సవాల కరపత్రం, పోస్టర్ ఆవిష్కరణ

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని యజ్ఞవరాహక్షేత్రంలో ఈనెల 10వ తేదీ నుంచి జరిగే 39వ వార్షిక బ్రహ్మోత్సవాల కరపత్రం, పోస్టర్‌ను శనివారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆమె కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం నిర్వాహకులు ఉత్సవాలకు ఆమెను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వీఎస్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్, డీవి శేషాచార్య, ఎస్ నరేందర్, కెఎస్ అనంతాచార్య, కెబిశర్మ పాల్గొన్నారు.

10న ఆలయాల హుండీల లెక్కింపు

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రశాంతనగర్ ప్రసన్నాంజనేయస్వామి ఆలయహుండీలను శుక్రవారం ఉదయం 9-30గంటలకు, జ్యోతీనగర్ హనుమాన్ సంతోషిమాత ఆలయ హుండీలను మధ్యాహ్నం 12గంటలకు లెక్కించనున్నట్లు ఆయాఆలయాల ఈఓ ఎన్‌శ్రీనివాస్ ఒకప్రకటనలో తెలిపారు.

ఇటుక బట్టీ కూలీలకు అన్నదానం

కరీంనగర్ టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ బొమ్మకల్ ఆధ్వర్యంలో బొమ్మకల్ ఇటుక బట్టీల్లో పని చేస్తున్న వలస కూలీలకు అన్నదానం చేశారు. శనివారం బొక్కల సాయి కిరణ్ పటేల్ జన్మదినం పురస్కరించుకొని కూలీల మధ్య కేక్ కట్ చేసి దాదాపు 150 మంది కార్మికులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు, లయన్ పురమల్ల శ్రీనివాస్, బొక్కల రేణుక, జయరాం, లయన్ చింతల లావణ్య కిషన్ పటేల్, లయన్ బట్టు రాజేందర్, కాంరెడ్డి నర్సింహారెడ్డి, చింతల శివాని, ఎట్టెపు వేణు, కందుల సాగర్, మహేశ్ పాల్గొన్నారు.

గ్రూప్-2 ఫలితాల్లో హుజూరాబాద్ వాసి ప్రతిభ


మహేష్‌కృష్ణ

హుజూరాబాద్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణానికి చెందిన అమిరిశెట్టి మహేష్‌కృష్ణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్-2 ఫలితాల్లో అసిస్టెంట్ సెక్షన్‌ఆఫీసర్(ఏఎస్‌వో) ఎంపికయ్యాడు. మహేష్‌కృష్ణ హుజూరాబాద్‌లోని శిశుమందిర్‌లో పదోతరగతి, కాకతీయ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్, హైద్రాబాద్‌లోని సీవీఆర్ కళాశాలలో బీటెక్ పూర్తి చేశాడు. 2024లో విడుదల చేసిన గ్రూప్-4 ఫలితాల్లో 260వ ర్యాంకు సాధించి కమర్షియల్ టాక్స్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించాడు. తాజాగా విడుదలైన గ్రూప్-2లో 384మార్కులు సాధించి సెక్రటేరియట్(జీఏడీ) విభాగంలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (ఏఎస్‌వో)గా ఎంపికయ్యాడు. తల్లిదండ్రులు అమిరిశెట్టి విజయ-శంకరయ్య, బంధువులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు సరిచూడాలి

గంగాధర, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో గ్రామాధికారులు వసతులు సరిచూడాలని ఎంపీవో గౌరీ రమేష్ సూచించారు. శనివారం ఆయన మండలంలోని రంగారావుపల్లి, గట్టుబూత్కూర్ గ్రామపంచాయతీలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా పంచాయతీ రికార్డులను పరిశీలించిన ఆయన గ్రామపంచాయతీ పన్నులు వసూళ్ల వేగవంతం చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, నీటి సౌకర్యం, ర్యాంపులను ఏర్పాటు చేయాలని గ్రామాధికారులకు సూచించారు. గ్రామంలో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మురుగు నీటి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ, రోడ్ల వెంట చెత్తను తొలగించాలని బ్లీచింగ్ చేయించాలని కార్యదర్శులకు సూచించారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆమె నేత్రాలు సజీవం

● నేత్రదానంతో ఇద్దరు అంధులకు చూపు

ఇల్లందకుంట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తాను మరణించిన తను కండ్లు మరో ఇద్దరికి చూపును ప్రసాదించేలా చేసిన ఇల్లందకుంట మండలం సిరిసేడు గ్రామానికి చెందిన యాద సరస్వతి ఆదర్శ ప్రాయురాలు అని సదాశాయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు మచ్చగిరి నరహరి అభినందించారు. శుక్రవారం సాయంత్రం సరస్వతి(45) గుండెపోటుతో మృతిచెందారు. సరస్వతి మృతి విషయాన్ని బంధువుల ద్వారా తెలుసుకున్న మచ్చగిరి నరహరి జిల్లా సదాశయ ఫౌండేషన్ అధ్యక్షుడు నేత్రదానంపై వారి కుటుంబసభ్యులకు శనివారం అవగాహన కల్పించడంతో కుటుంబసభ్యులు నేత్రదానానికి అంగీకరించారు. సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు మచ్చగిరి నరహరి ఆధ్వర్యంలో వరంగల్ ఎల్వీ ప్రసాద్ టెక్నీషియన్ లక్ష్మణ్ సహకారంతో నేత్ర సేకరణ చేసి హైద్రాబాద్ ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంకు పంపారు. ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించిన భర్త యాదవీరన్న, కుటుంబసభ్యులను అభినందించి ప్రశంసాపత్రం అందించారు. కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, జాతీయ కార్యదర్శి డాక్టర్ బీష్మాచారి, రమేష్, రామకృష్ణారెడ్డి, వాసు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

తాటిచెట్లను కాల్చిన వారిపై చర్యలు చేపట్టాలి

భగత్‌నగర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీపూర్ గ్రామంలో సర్వే నెంబరు 24లో ఉన్న తాటిచెట్లను కాల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని లక్ష్మీపూర్ కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం అందించారు. కాంతల మధుసూదన్‌రెడ్డికి చెందిన వ్యవసాయ భూమిలో ఉన్న తాటి చెట్లనుంచి కల్లుగీయకుండా భూయజమాని అడ్డుకుంటున్నాడన్నారు. వ్యవసాయ భూమిలో ఉన్న చెట్లను కాల్చివేయడం జరిగిందని వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గౌడ సంఘం అధ్యక్షుడు బొమ్మ తిరుపతిగౌడ్ కోరారు.

బొగ్గు గనుల అమ్మకాలు సింగరేణికి ప్రమాదం

● నికర లాభాలను నుంచి బోనస్ ఇవ్వకుండా మోసం చేసిన యాజమాన్యం
● కాంట్రాక్ట్ కార్మికులకు మొండిచేయి
● జీఎల్‌బీకేఎస్ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రావు

గోదావరిఖని, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సింగరేణికి 40వేల మంది గని కార్మికులు, 35వేల మంది కాంట్రాక్టు కార్మికులు సమష్టిగా చేసిన కృషి ఫలితంగా రూ.6390కోట్ల లాభాలు వచ్చాయని, అందులో 3వంతులు దారి మళ్లించి రూ.2వేల కోట్లు ప్రకటించి బోనసు ఇవ్వడం అన్యాయమని గోదావరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు ఎస్ వెంకటేశ్వరరావు, ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి టీ శ్రీనివాస్ అన్నారు. శనివారం గోదావరిఖని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో జరిగిన సింగరేణి ప్రాంత ముఖ్యకార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ బొగ్గుగనుల అమ్మకాలకు కాంగ్రెసు ప్రభుత్వం అనుమతించటం దానికి గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు విజ్ఞప్తి చేయటం సింగరేణి సంస్థకు ప్రమాదకరమైందని, కార్మికుల మనుగడకు ఉరితాడు లాంటిదన్నారు. కంపెనీకి వచ్చిన మొత్తం లాభాల నుంచి బోనసును చెల్లించాలని, లాభాలలో సమభాగంగా ఉన్న కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500ఇవ్వటం అవమానకరమైందన్నారు. సింగరేణి యాజమాన్యం ప్రభుత్వ యంత్రాంగానికి లొంగిపోతుందని, రాజకీయ జోక్యాన్ని సింగరేణిలో పెంచడం వల్ల పరిశ్రమకు నష్టం తలెత్తిందన్నారు. సింగరేణి యాజమాన్యం తన ఆలోచన ధోరణి మార్చుకొని సింగరేణి పరిశ్రమను బతికించేందుకు బొగ్గుగనుల అమ్మకాలకు వ్యతిరేకంగా నిలబడాలని, కంపెనీలో కొత్త బొగ్గు బావులను తీయాలని, ఉద్యోగ ఉపాధిని కల్పించాలని, కార్మిక వ్యతిరేక చర్యలను విడనాడాలని అన్నారు. ఐ కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రవర్కింగ్ ప్రెసి డెంట్ డీ బ్రహ్మానందం, జీఎల్ బీకేఎస్ ప్రధానకార్యదర్శి జే సీతారామయ్య, ఏ వెంకన్న, ఎండీ రాసుద్దీన్, ఈ నరేష్, ఈదునూరి రామకృష్ణ, రాజేశం, మల్లేశం పాల్గొన్నారు.



గాయపడ్డ కార్మికులను పరామర్శించిన సీతారామయ్య


చికిత్స పొందుతున్న కార్మికుడిని పరామర్శిస్తున్న సీతారామయ్య

గోదావరిఖని, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో వివిధ ప్రాంతాల్లో జరిగిన గని ప్రమాదాల్లో గాయపడి హైదరాబాద్ కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న కార్మికులను శనివారం సింగరేణికాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య పరామర్శించారు. సింగరేణి మందమర్రి ఏరియాకు చెందిన జే రవీందర్, ఆర్‌జీ-2 ఏరియా ఓసీపీ-3లో షావల్ ఆపరేటర్ ఎ లక్ష్మీనారాయణ, భూపాలపల్లి ఏరియా కేటీకే 6ఇంక్లైన్‌కు చెందిన గూడెల్లి మొండయ్యలు గని ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడగా, వారిని సీతారామయ్య పరామర్శించారు. వారి కుటుంబసభ్యులతో మాట్లాడి యూనియన్ అన్నివిధాలా అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. సీతారామయ్య వెంట డాక్టర్ బాల కోటయ్య ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఏపీఏ మేనేజర్

రామగిరి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఏపీఏ మేనేజర్‌గా హస్తి పెంచలయ్య, సేఫ్టీ అధికారి కటకం కమలాకర్ శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీఏ జీఎం నాగేశ్వర్‌రావు నూతనంగా పదవీబాధ్యతలు చేపట్టిన అధికారులకు సత్కరించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి జనార్దన్, ప్రాజెక్టు ఇంజనీర్ రఘురామ్, అధికారులు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన సంజీవరెడ్డి, జనక్ ప్రసాద్


కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సంజీవరెడ్డి, జనక్ ప్రసాద్

గోదావరిఖని, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు జీ సంజీవరెడ్డితో కలసి తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహామండలి చైర్మన్ ఐఎన్‌టీయూసీ సెక్రెటరీజనరల్ బీ జనక్ ప్రసాద్ శనివారం కేంద్రబొగ్గు,గనులమంత్రి కిషన్‌రెడ్డిని హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొగ్గు గని కార్మికుల సంక్షేమం, జేబీసీసీఐకి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చలు జరిగాయి. ఐఎన్‌టీయూసీ అనేది దేశంలోనే అతిపెద్ద చరిత్రగల కార్మికసంఘమని, జేబీసీసీఐలో ఉన్న అన్ని కమిటీల్లో ఐఎన్‌టీయూసీ ప్రతినిధులను చేర్చాలని ప్రతినిధులు కోరారు. దీనివల్ల బొగ్గు గనుల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించవచ్చని వారు పేర్కొన్నారు. దీనిపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సానుకూలంగా స్పందించి, కోల్ ఇండియా ప్రతినిధులతో వెంటనే మాట్లాడి జేబీసీసీఐలోని అన్ని కమిటీలలో ఐఎన్‌టీ యూసీకి ప్రాతినిధ్యం కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా, సింగరేణికి కొత్త బొగ్గు బ్లాకులు మంజూరు చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, సంస్థ క్రిటికల్ మినరల్స్ మైనింగ్ రంగంలో విస్తరించడానికి కేంద్రం నుంచి అవసరమైన సహకారం అందించాలని ఐఎన్‌టీయూసీ ప్రతినిధులు కోరారు. దీనిపైకూడా మంత్రి సానుకూలంగా స్పందించారు. సమావేశంలో ఐఎన్‌టీయూసీ వైస్‌ప్రెసిడెంట్ సత్యజిత్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీ ఆర్‌డీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఉత్పత్తి, ఉత్పాదకతపై జీఎం సమీక్ష


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జీఎం లలిత్ కుమార్

గోదావరిఖని, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 ఏరియాకు సంబంధించిన ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణా, సంక్షేమంపై ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్ శనివారం జీఎం కార్యాలయంలో డిపార్ట్‌మెంట్ అధికారులు, ప్రాజెక్టు ఆఫీసర్, ప్రాజెక్టుమేనేజర్, ప్రాజెక్టుఇంజనీర్స్, అన్నిగనుల ఏజెంట్స్, మేనేజర్స్ వివిధ విభాగాల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌జీ-1 ఏరియాలో కీలకమైన పనుల పురోగతి ప్రస్తుత స్థితి, చేపట్టే పనుల వివరాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ నిర్వహించారు. ప్రధానంగా ఖర్చు తగ్గింపు చర్యలు, పని విధానంలో మెరుగుదల, ఉత్పత్తి ఉత్పాదకతా పెంచడం, బొగ్గు నాణ్యతలో మెరుగుదల, తదితర అంశాలపై ఈ సమీక్ష సమావేశంలో వివరించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం చంద్రశేఖర్, ఏజెంట్లు చిలుక శ్రీనివాస్, ఎల్ రమేష్, ప్రాజెక్ట్ అధికారి రమేష్, ఏరియా రక్షణ అధికారి సాయి ప్రసాద్, అధికారులు శివ నారాయణ, రాందాస్, వేణు, సాంబశివరావు, మైడీశ్వర్, లక్ష్మీరాజు, క్రాంతి పాల్గొన్నారు.